క్లుప్తంగా

చమ్మచింత పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

నాతవరం: శ్రేయోభిలాషి ఫౌండేషన్ కృషితో చమ్మచింత ప్రభుత్వ పాఠశాలకు విశాఖపట్నానికి చెందిన విశ్వనాథ్, భువనేశ్వరి దంపతులు రూ.20 వేలు విలువ చేసే సామగ్రిని వితరణగా అందజేశారు. శ్రేయోభిలాషి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న విశ్వనాథ్, భువనేశ్వరి దంపతులు తమ కుమార్తె వీక్ష పేరు మీద పాఠశాలకు మైకు సౌండ్ సిస్టమ్, వైర్లెస్ మౌత్ అందజేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నానాజీ, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భీమిలి డైట్ కళాశాల బృందం ఆకస్మిక తనిఖీ



కె.సంతపాలెంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రవి

కె.కోటపాడు: మండలంలో కె.సంతపాలెం, చంద్రయ్యపేట పాఠశాలలను భీమిలి డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.రవితోపాటు ఉపాధ్యాయ బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించింది. విద్యార్థులకు తరళ్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసి వారిలో అభ్యసనా నైపుణ్యాన్ని మెరుగుపర్చేలా చర్యలను తీసుకోవాలని ఉపాధ్యాయులకు వైస్ ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు, టీచర్స్ డైరీలను పరిశీలించి సూచనలు చేశారు. అధ్యాపకులు త్రినాథరావు, పి.హరిణి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు



స్టీల్ పరిశీలిస్తున్న ఆ శాఖ ఇంటెలిజెన్సీ అధికారి సుబ్రహ్మణ్యం

రోలుగుంట: స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని ఆ శాఖ ఇంటెలిజెన్సీ అధికారి బర్ల సుబ్రహ్మణ్యం శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. హౌసింగ్ ఏఈ ప్రేమానందంతో మండలంలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల స్థాయిపై చర్చించారు. గృహ నిర్మాణాల మెటీరియల్ స్టాకు వివరాలపై ఆరా తీశారు. లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు ఆవరణలో ఉన్న స్టీల్ క్వాలిటీని, గొడౌన్‌లో సిమెంటు నిల్వ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక జగనన్న లేవుట్-2లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. రహదారి, విద్యుత్ సౌకర్యం, తదితర మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించి తగు సూచనలు చేశారు.

మహిళలే చైతన్య దీపికలు



మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ డైజి

రావికమతం: మహిళలతోనే సమాజం చైతన్యవంతం కానుందని, వారు వ్యక్తిగత శుభ్రతతోపాటు గ్రామాల పరిశుభ్రతపై బాధ్యత తీసుకోవాలని వెలుగు ఏపీడీ డైజి తెలిపారు. రావికమతంలో రెండు రోజు విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. శిక్షణ పొందిన అంశాలపై ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఆరుబయట మలవిసర్జన ప్రధాన సమస్య అన్నారు. ప్రతి మహిళ దీనిపై బాధ్యత వహించి, ఇంటి వద్దే మరుగుదొడ్డి ఉపయోగించేలా చైతన్యం కలిగించాలన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ చంద్రకళ, రావికమతం ఏపీఎం తిలక్, కశింకోట, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, నక్కపల్లి, పాయకరావుపేట ఏపీఎంలు హాజరయ్యారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి



రోలుగుంట: కొవ్వూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి సత్యనారాయణ(65) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. పొలం పనులకు వెళ్లి వస్తూ బీపీ లెవెల్స్ పెరగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్యనారాయణకు దత్తపుత్రుడు ఉన్నాడు.

చివరి రోజూ అదే జోరు

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా ముగిశాయి. చోడవరం, చీడికాడలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీలు చివరి రోజు రసవత్తరంగా సాగాయి. పలు జట్ల మధ్య పోరు నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. వీటిలో ప్రతిభ చూపిన జట్లను జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు.

- రసవత్తరంగా నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్
- జిల్లా స్థాయి పోటీలకు పలు జట్లు ఎంపిక

చోడవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారం ఉత్సాహంగా ముగిశాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం నుంచి అండర్ - 14, 17 బాలికల జట్లు తలపడ్డాయి. చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల స్థాయిలో ఎంపికైన జట్లు కబడ్డీ, ఖోఖో, బాల్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్ త్రో వంటి పలు క్రీడాంశాల్లో రెండు విభాగాల్లో పోటీపడ్డారు. ఇక్కడ ఎంపికైన జట్లు ఈ నెల 25 నుంచి జరగనున్న జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకుడు ఫిజికల్ డైరెక్టర్ సింగంపల్లి అప్పలనాయుడు తెలిపారు. 25న లంకెలపాలెం పాఠశాలలో ఖో-ఖో పోటీలు, 26న మాకవరపాలెం పాఠశాలలో కబడ్డీ, 27న హరిపాలెం పాఠశాలలో పోటీలు నిర్వహించి జిల్లా జట్ల ఎంపిక చేస్తారన్నారు. ఇతర పోటీల వేదికలు, తేదీలు తర్వాత ప్రకటిస్తారని, జిల్లా పోటీలకు ఎంపికైన జట్లు ఆయా పాఠశాలలకు ఉదయం పది గంటల లోపుగా చేరుకోవాలని సూచించారు. క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసులమ్మ, ఎంఈవో జయలక్ష్మి పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం సభలో మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యంతోపాటు, తదనంతరం విద్య, ఉద్యోగాలలో అవి ఉపకరిస్తాయన్నారు.



చోడవరం రూరల్: ఖోఖో పోటీలో తలపడిన బాలికలు



చోడవరం రూరల్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ, ఎంఈవోలు



చీడికాడ: ఖో-ఖో ఆడుతున్న బాలికలు



చీడికాడ: జిల్లాకు ఎంపికైన బాలికల వాలీబాల్ టీముతో పీడీలు

చీడికాడలో...

చీడికాడ: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ రెండో రోజు శనివారంతో ఉత్సాహంగా ముగిశాయి. ఇక్కడ హైస్కూల్‌లో బాలికలు అండర్-14, 17 విభాగాల్లో తలపడ్డారు. 9 విభాగాల్లో ప్రతిభ చూపిన జట్లను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, ఖోఖో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, షటిల్, అథ్లెటిక్స్ విభాగాల్లో నాలుగు మండలాల నుంచి నాలుగు జట్లు పోటీపడ్డాయి. 100, 200, 400, 800, 1,600 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేశారు. చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి బాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, తహసీల్దార్ బి.వి.రాణి పాల్గొని విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈవోలు బొంజుబాబు, రమణ పాల్గొన్నారు.

స్వమిత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

డీఎల్‌పీవో మూర్తి

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి సిబ్బందికి సూచించారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం డివిజన్‌లోని ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వే చేసి, హద్దులు, విలువను లెక్కకట్టి మ్యాపింగ్ చేయాలన్నారు. సర్వే వల్ల ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. సర్వే అనంతరం ప్రతి ఇంటి యజమానికి కార్డు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే అచ్యుతాపురంలో సర్వే పూర్తి చేసి, కార్డులు జారీ చేశామన్నారు.

సమాజ అవగాహనకు ఎన్‌ఎస్‌ఎస్



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న వక్తలు

చోడవరం రూరల్: విద్యార్థి దశలో సమాజం పట్ల అవగాహన ఏర్పరచుకోవడానికి ఎన్‌ఎస్‌ఎస్ ఎంతగానో ఉపకరిస్తుందని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరడం వల్ల దేశసేవ, మానవ విలువలు అలవడతాయన్నారు.1969లో సెప్టెంబర్ 24ను ఎన్‌ఎస్‌ఎస్ డే గా ప్రకటించారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, తెలుగు డిపార్ట్‌మెంట్ హెడ్ సిహెచ్.జ్యోతి, అధ్యాపకులు లక్ష్మీమంగమ్మ, కోమలి, ఎస్.ఎం.రఫీయుద్దీన్, వి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

27న రోలుగుంటలో జగనన్నకు చెబుదాం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు, ఎంపీడీవో ప్రభాకర్రావు

రోలుగుంట: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈ నెల 27న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు అందరికీ అనువైన స్థల పరిశీలన కోసం స్థానిక పాత రామ మందిరం వద్ద కల్యాణ మండపం, స్త్రీశక్తి భవనం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం, మండల పరిషత్ ఆవరణను మండల ప్రత్యేకాధికారి డి.ప్రసాదరావు, తహసీల్దార్ కె.వరహాలుతో కలసి పరిశీలించారు. స్త్రీశక్తి భవనంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఇక్కడ అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, మండల స్థాయిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యపూజలు.. అన్నసమారాధనలు



రావికమతం: 30 అడుగుల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు



మాడుగుల రూరల్: కె.జె.పురం కళావేదికపై గణపతికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న భక్తురాలు



రావికమతం: గ్రౌండ్‌బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన



దేవరాపల్లి : కొల్లూరి వీధిలో వడ్డన చేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు



మాడుగుల: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మాడుగుల: అన్న సమారాధనలో భక్తులు



నాతవరం: వినాయకుడి గుడి వద్ద అన్నదానం

రావికమతం: వినాయక నవరాత్రుల్లో భాగంగా భక్తులు నిత్య పూజలు కొనసాగుతున్నాయి. రావికమతం, చినపాచిల వినాయక యూత్, కొత్తకోట గ్రౌండ్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయా వినాయక మండపాల వద్ద శనివారం అన్న సమారాధనలు నిర్వహించారు. కొత్తకోట 30 అడుగుల వినాయక విగ్రహం వద్ద గణేష్ మాలధారణ భక్తులతోపాటు మహిళలు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

అన్ని దానాల కంటే అన్నదానం మిన్న

దేవరాపల్లి: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు తెలిపారు. స్థానిక కొల్లూరి వారి వీధి పాత బస్టాండ్ సమీపంలో వినాయకుని మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు వడ్డన చేసి ప్రారంభించారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వాలేటి నాగరాజు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు దీవి శంకర్, కర్రి రామారావు, కర్రి వీరాస్వామి, వంటాకు రాంబాబు, దీవి సత్తిబాబు, చప్ప అప్పలనాయుడు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో బంగారుమెట్ట, సీతయ్యపేట, గున్నెంపూడి, మల్లాం తదితర గ్రామాల్లో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, గ్రామ పెద్దల సహకారంతో అన్నసమారాధనలు నిర్వహించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురంలోని దిబ్బవీధి సమీపంలో బియ్యం కొండమ్మ ఇంటి వద్ద 47 ఏళ్లగా నిర్వహిస్తున్న చవతి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు కాపు వీధిలో వినాయకుని వద్ద గ్రామ సమీపంలో కళ్లాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

15 కిలోల లడ్డూ గణపతికి వితరణ

కె.జె.పురం కళావేదికపై ప్రతిష్ఠించిన గణపతికి గ్రామానికి చెందిన రాపేట సన్యాసినాయుడు కుమారులు సంతోష్, కోటిప్పారావు, రామార్జున 15 కిలోల లడ్డూను వితరణగా అందించారు. ఈ ఉత్సవాలు మహాత్మ టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

మాడుగుల: వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వినాయకునికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్దేరులో నిమజ్జనం చేశారు. అనంతరం జంక్షన్‌లో మెకానిక్ సభ్యులు ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు.

నాతవరం: స్థానిక బీసీ కాలనీలో వరసిద్ధి వినాయక ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆలయ నిర్మించిన నాటి నుంచి ఏటా వినాయక చవితి నవరాత్రులతో పాటు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కె.కోటపాడు: వారాడలో వినాయక స్వామి గుడి వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారాడ, యడ్లవానిపాలెం, చిరికివానిపాలెం, వి.సంతపాలెం గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, బొడ్డు దొరస్వామి నాయుడు(లాయర్), చెల్లూరి రమేష్, గిడుతూరి తాతబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: నవరాత్రోత్సవాల్లో భాగంగా గొలుగొండలో అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంతోపాటు జోగుంపేట, చిన్నయ్యపాలెం తదితర గ్రామాల భక్తులు తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఎంపీటీసీల రెండేళ్ల పాలన సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎంపీటీసీలు

చోడవరం: పదవీ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీటీసీలంతా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గాడి కాసు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తాము ఎంపీటీసీలుగా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి కావడం ఆనందంగా ఉందన్నారు. రెండేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సహకారంతో మండలంలో అన్ని గ్రామాల్లోనూ వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవసరమైన చోట్ల తాగునీటి బోర్లు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేశామన్నారు. రానున్న మూడేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు మండల పరిషత్ నుంచి చేపడతామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో చైతన్య, వైస్ ఎంపీపీలు బైన కుమారి ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పల్లా సంతోషిరమణ పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలకు తక్షణమే పరిష్కారం

- మూడో విడతలో 118 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే
- నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరాం

నాతవరం: డివిజన్‌లో జగనన్నకు చెబుదాం అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖల వారీగా వెన్వెంటనే పరిష్కరిస్తామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరాం తెలిపారు. ఆయన శనివారం ఎం.బెన్నవరం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించి సచివాలయం ద్వారా అందించే సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే అంకిత భావంతో చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ -క్రాప్, ఈకేవైసీ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై చర్చించారు. సచివాలయ సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పనుల మీద సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా మాట్లాడాలన్నారు. సచివాలయ పరిధిలో రెవెన్యూ పరమైన సమస్యలపై రైతులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి ఆధ్వర్యంలో నాతవరం, కోటవురట్ల, రావికమతం, గొలుగొండ మండలాల్లో నిర్వహించారన్నారు. ఆయా మండలాల్లో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖల వారీగా పరిష్కరిస్తామన్నారు. నర్సీపట్నం డివిజన్‌లో మూడో విడతగా 118 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రీసర్వే చేసిన గ్రామాల్లో జగనన్న భూరక్ష -2020 రాళ్లు వేశామన్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూములకు ఆన్‌లైన్‌లో పాసు పుస్తకాలు ఇంటికే ఉచితంగా ఇస్తున్నామన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, నర్సీపట్నం డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టరు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ విద్యా విభాగం మండలాధ్యక్షుడు ఇట్టంశెట్టి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యుడు తమరాన రాము, రామరాజు చెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు శిరుసుపల్లి శేఖర్, వీఆర్వో బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ డైరెక్టర్‌కు అభినందన



సత్యనారాయణను అభినందిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా ఎంపికైన కొమళ్లపూడికి చెందిన గేదెల సత్యనారాయణను పలు గ్రామాల రైతు సంఘ నాయకులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అభినందించారు. బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో పాడి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సత్యనారాయణను విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా శుక్రవారం విశాఖలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆయన్ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఫోన్లో అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, బుచ్చెయ్యపేట, తురకలపూడి కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, భూషణం, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, బీసీ సంఘం మండలాధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు జోగా కొండబాబు, పెదపూడి, దిబ్బిడి సర్పంచ్‌లు గోకివాడ వరకృష్ణ, పెదిరెడ్ల మాణిక్యం, బుచ్చెయ్యపేట మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వేపాడ మధు, యన్నెంశెట్టి రామారావు, నైదాన రాజు, వేపాడ సత్తిబాబు, ఈశ్వరరావు, గొన్నా హరికృష్ణ, గేదెల అప్పారావు, పలు గ్రామాల పాల సంఘం అధ్యక్షులు, సాగునీటి సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు సత్కరించారు.

మరుగుదొడ్డికి అదనంగా రూ.12 వేలు

ఎంపీడీవో హనుమంతరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారుల ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటుకు ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుందని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, హౌసింగ్, పంచాయతీ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంతలకు మొదట విడతలో మండలానికి 140 మంజూరైనట్టు తెలిపారు. వాటిని లబ్ధిదారులంతా సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. నిర్మాణం పూర్తి చేసిన ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మాణానికి అదనంగా రూ.12 వేలు ఇస్తుందన్నారు. ప్రభుత్వం హౌసింగ్ లబ్ధిదారులకు కలిగిస్తున్న సదుపాయాలను అవగాహన కల్పించాలన్నారు. నవంబరు నెలాఖరుకు జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. వారికి ఉచితంగా విద్యుత్ మీటరు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలాంటి సమస్య లేకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. హౌసింగ్ జేఈ జోగారావు, ఉపాధి ఏపీవో చిన్నరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



కాశీపురం విద్యార్థులతో హెచ్ఎం సుందరి

రావికమతం: నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన రావికమతం మండలం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చోడవరంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో ఖోఖోకు పి.సుస్మిత, ఇ.యశోద, వై.అనూరాధ, కె.దివ్య, ఎం.శ్యామల, ఎస్.భాస్కర్, కబడ్డీకి కె.వర్ధన్, ఎం.శివ కుమార్, 100 మీటర్ల పరుగుకు కె.వర్ధన్, హైజంప్ ఎస్.బాలాజి ఎంపికయ్యారు. మండల స్పోర్ట్సు కోఆర్డినేటర్ లక్ష్మణరావు, రావికమతం హైస్కూల్ కమిటీ చైర్మన్ కొశిరెడ్డి ప్రసాద్, హెచ్ఎం మల్లికార్జునరావు శనివారం అభినందించారు.

దేవరాపల్లి: జిల్లా స్థాయి క్రీడా పోటీలకు కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది ఎంపికయ్యారని హెచ్ఎం పి.బి.టి సుందరి తెలిపారు. చీడికాడలో ఈనెల 22న నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో నలుగురు, అండర్-14 విభాగంలో నలుగురు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వీరిని హెచ్ఎం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు రాంబాబు అభినందించారు.

పక్కాగా ఆరోగ్య సర్వే

దేవరాపల్లి/కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా నిర్వహిస్తున్నామని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలిత తెలిపారు. దేవరాపల్లి మండలం కాశీపురం, మారేపల్లి, గరిశింగి, తెనుగుపూడి గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. కె.కోటపాడు మండలం గొట్లాంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు పర్యవేక్షించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి అవసరమైన వారికి బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనారోగ్య బాధితులను, దీర్ఘ కాలిక వ్యాధి గ్రస్తుల వివరాలను నమోదు చేశారు.

డాక్యుమెంట్లు పోయినవి

ఆనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం, రోలుగుంట గ్రామ కాపురస్తులు అనపర్తి మణిదీపక్‌కుమార్ S/o వీరభద్రరావు నాకు నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి గ్రామంలో సర్వే నంబరు 1వ ప్రస్తుత డాక్యుమెంట్ నెం. 2216/2022లో డాక్యుమెంటు కలదు. దాని లింకు డాక్యుమెంట్ 110/1999 నులిపెద్ది వీరవెంకటరావు కనక సత్య మల్లేశ్వరరావు ఈ పేరునున్న డాక్యుమెంట్ పోయినది. దయచేసి ఎవరికైనా దొరికిన యెడల నర్సీపట్నం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు.

ఇట్లు: ఎ.మణిదీపక్‌కుమార్